క్లుప్తంగా

నేడు మాతృభాషా దినోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం అరసం, ఇస్కఫ్, మహిళా కళాశాల సంయుక్తంగా మాతృభాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా, ఇలిసిపురం యూటీఎఫ్ భవనంలో 'రెడ్‌బుక్ డే' పేరిట మహాకవి శ్రీశ్రీ రచన మహా ప్రస్థానం నుంచి కవితా పఠనం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.

26న మెగా రక్తదాన శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీలో న్యూసెంట్రల్ స్కూల్ ఆవరణలో ఈ నెల 26న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల 29వ వార్షికోత్సవం సందర్భంగా జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ సభ్యుల సహకారంతో శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థులు, శ్రేయోభిలాషులు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: ఏపీయూడబ్ల్యూజే డైరీని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. జర్నలిస్టుల సంఘం పేరుతో డైరీని ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం సర్పంచ్ డొంక ఆదిలక్ష్మి కుమారుడు వెంకటరమణ అనారోగ్యంతో విశాఖపట్నం కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సోమవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, నిర్వహణ నేపథ్యంలో బుధవారం విద్యుత్ కోత అమలు చేయనున్నట్లు ఈఈ ఎస్.అబ్బయ్యనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల, గుజరాతీపేట, కొయ్యాం, ధర్మవరం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.
లావేరు: మండలంలోని అన్ని గ్రామాలకు ఈ నెల 22న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్.బయ్యన్ననాయుడు తెలిపారు.

శ్రీనివాసరావుకు డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న సూర శ్రీనివాసరావు

ఎచ్చెర్ల క్యాంపస్/శ్రీకాకుళం అర్బన్: కుశాలపురం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త సూర శ్రీనివాసరావుకు విశాఖపట్నానికి చెందిన సెయింట్‌పాల్స్ థియోలాజికల్ కాలేజ్ సోమవారం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. కరోనా సమయంలో, పేదలకు సేవా కార్యక్రమాలు అందించడంలో చేస్తు న్న కృషికి గాను డాక్టరేట్ అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్నాతకోత్సవంలో భాగంగా విశాఖపట్నంలోని కళాశాలలో నిర్వహించి న కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కేవీఎల్ పాల్ చేతుల మీదుగా ఈ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్తులో మరింతగా సేవా కార్యక్రమాలు చేపడతానని చెప్పారు.

అరిణాం అక్కివలసలో నేత్ర వైద్యశిబిరం



శస్త్రచికిత్స కోసం వెళ్తున్న వృద్ధులు

ఎచ్చెర్ల క్యాంపస్: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అరిణాం అక్కివలసలో సోమవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 61 మందిని పరీక్షించి శస్త్ర చికిత్సలకు 30 మందిని ఎంపిక చేశారు. వీరిని ప్రత్యేక బస్సులో విజయనగరం ఆస్పత్రికి పంపించారు. జయసంజీవి ట్రస్టీ ధనాలకోటి రమణ పర్యవేక్షించారు. ఆప్తమాలజిస్ట్ సురేష్ పరీక్షలు నిర్వహించగా, శంకర్ ఫౌండేషన్ క్యాంప్ కోఆర్డినేటర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

- రైతుల ఇబ్బందిని అర్థం చేసుకోవాలి
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల వినతి

శ్రీకాకుళం రూరల్:

ప్రభుత్వం ఇప్పటికే లక్ష్యాల మేరకు ధాన్యం కొనుగోలు చేసిందని, అయినప్పటికీ ఇంకా చాలా మంది రైతుల వద్ద ధాన్యం నిల్వలు ఉన్నాయని, వాటిని వెంటనే కొనుగోలు చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు కోరారు. సోమవారం శ్రీకాకుళం రూరల్ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అంబటి నిర్మలా శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత వ్యవసాయశాఖ సమీక్షలో సభ్యులంతా పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడికక్కడ ధాన్యం నిల్వలు ఉన్నాయన్నారు. పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. దీనిపై తహసీల్దార్ ఎస్.వెంకటరావు స్పందిస్తూ ఈ విషయమై ఇప్పటికే రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ప్రభుత్వానికి నివేదించారని తెలిపారు. ప్రస్తుతం మిల్లర్లు కొనుగోలు చేయడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

- విద్యాశాఖ సమీక్షలో నాడు–నేడు ప్రోగ్రాంలో భాగంగా భారీగా నిధులను వినియోగించి పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నప్పటికీ సిబ్బంది కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని రాగోలు ఎంపీటీసీ సభ్యులు చెంగళ్వరావు తదితరులు ప్రశ్నించారు.
- విద్యుత్‌శాఖ సమీక్షలో భాగంగా కనుగులవానిపేట ఎంపీటీసీ సభ్యుడు కె.అప్పలనాయుడు మాట్లాడుతూ ఇంటి పైనుంచి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని, ఒక ప్రజాప్రతినిధి మాటకే విలువ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని నిలదీశారు.
- పశువైద్యాధికారి మాట్లాడుతూ పశు పోషకులకు మరింతగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 1962 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అత్యవసర వేళల్లో సంచార వాహనాలను వినియోగించుకోవాలని సూచించారు. మండలానికి ఒక వాహనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు అంబటి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, ఎంపీడీఓ వి.రఘు, తహసీల్దార్ ఎస్.వెంకట్రావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పన్నుల వసూల్లో నిర్లక్ష్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఓబులేసు

- మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతి నివాసం నుంచి ఇంటి పన్ను, కుళాయి పన్ను, ఖాళీ స్థలం పన్నులను మార్చి నెలాఖరులోగా వసూలు చేయాలని కమిషనర్ చల్లా ఓబులేసు సిబ్బందిని ఆదేశించారు. పన్నుల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శతశాతం పన్నులు వసూలు చేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. నగరంలోని 50 డివిజన్లు, విలీన పంచాయతీలు ఏడింటిని కలుపుకుని అన్ని డివిజన్లలో ప్రతి రోజూ ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు వార్డు అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కలిసి ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించి పన్నులు కట్టించాలన్నారు. సచివాలయాల్లో పన్నులు చెల్లించవచ్చని, మున్సిపల్ కార్యాలయంలోనూ రెండు కౌంటర్లు నిరంతరం పని చేస్తాయని చెప్పారు. సమావేశంలో ఆర్‌ఐలు ఉమా, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

22న శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ రాక



మాట్లాడుతున్న గణేష్ గురూజీ

శ్రీకాకుళం కల్చరల్: ఈ నెల 22న కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి రానున్నట్లు జిల్లాకు బాలాత్రిపురసుందరి(పీఠం) కాలభైరవ దేవాలయం నిర్వాహకులు గణేష్ గురూజీ తెలిపారు. స్థానిక కాలభైరవాలయం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్వామీజీ శిష్యులతో కలిసి వస్తున్నారని, వారిని నవభారత్ కూడలి నుంచి పూర్ణకుంభ స్వాగతం పలికి ర్యాలీగా నగరంలోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. బలగ వద్ద మహిళలు కలశాలతో ఆహ్వానిస్తారని, అక్కడి నుంచి కాలభైరవ పీఠం వద్దకు మేళతాళాలతో తీసుకువస్తామని తెలిపారు. ఈ నెల 26 వరకు పీఠం వద్ద ఆశీస్సులు అందించడంతో పాటు భక్తులతో అనుగ్రహ భాషణ ఉంటుందని వివరించారు. అదే రోజు శత చండీ హోమంలో పాల్గొని 26న పూర్ణాహుతి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహాత్ముని సందేశాలు ఆదర్శనీయం



గోవిందరావును సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: మానవాళిని సన్మార్గంలో నడిపించే సిద్ధాంతాలను మహాత్మాగాంధీ ప్రతిపాదించారని గాంధీమందిరం, స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనం అధ్యక్షుడు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ అన్నారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి పాలకమండలి సభ్యునిగా నియమితులైన లుకలాపు గోవిందరావు సోమవారం గాంధీమందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు కె.ఎస్.ఎస్.ప్రసాద్ (హారికా ప్రసాద్) మాట్లాడుతూ దైవత్వం, మానవత్వం రెండు వేర్వేరు కాదని, మానవత్వం అన్నది సేవద్వారా సఫలమవుతాయని అన్నారు. కార్యక్రమంలో గాంధీ మందిర కోకన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు, మందిర కమిటీ సభ్యులు ఆచార్య విష్ణుమూర్తి, పొన్నాడ రవికుమార్, మహిబుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలపై సర్వే



సర్వే చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ సుష్మ

రణస్థలం: పిల్లలంతా సమీపంలోని పాఠశాలకు వెళ్లి చక్కగా చదువుకోవాలని రణస్థలం గ్రామ సచివాలయం సిబ్బంది సూచించారు. రణస్థలం పంచాయతీలో సోమవారం బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. జి.ఢిల్లేశ్వరి అనే బాలిక చాలా రోజులుగా పాఠశాలకు వెళ్లడం లేదని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. 18 ఏళ్ల లోపు వారంతా చదువుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో దివ్యాంగులకు ప్రభుత్వం సరఫరా చేసిన వివిధ రకాల ఉపకరణాలను ఎంఈఓ కె.రాంబాబు సోమవారం పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో వివిధ కేటగిరీలకు సంబంధించి సుమారు 120 మంది దివ్యాంగ విద్యార్థులు చదువుతున్నారన్నారు. వారికి మానసిక, శారీర వికాసానికి భవిత కేంద్రం ద్వారా చర్యలు చేపడుతున్నామన్నారు. దశల వారీగా వివిధ రకాల ఉపకరణాలు, ఉపకారవేతనాలు వంటివి అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 9 మంది దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్లు, ట్రై సైకిళ్ల పంపిణీ చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వి.శ్రీరామచంద్రమూర్తి, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు సీతంనాయుడు, సీఆర్పీలు ధనుంజయరావు, కె.చంద్రరావు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ అభివృద్ధికి పొదుపు నిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: స్వయం శక్తి సంఘాలు బ్యాంకులో దాచుకుంటున్న పొదుపు నిధులను ఆదాయాభివృద్ధికి వినియోగించుకోవాలని ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో సీఎఫ్, వీఓఏలతో సోమవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. బీమా కార్యక్రమంలో భాగంగా పీఎం జేజేవై, ఎస్‌బీబీవై అర్హత కలిగిన ప్రతి సంఘంలో ఉన్నటువంటి మహిళలు వారి కుటుంబ సభ్యులు ఇన్సూరెన్స్ చేసుకునే విధంగా సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. సంఘంలోని తొమ్మిది మంది సభ్యులు తమ వ్యాపారాలాభివృద్ధికి సుమారు రూ. నాలుగు లక్షల 50 వేల వరకు రుణంగా తీసుకునే వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. సమావేశంలో సీసీ ఎ.రామకృష్ణ, మోహనరావు పాల్గొన్నారు.

నవధాన్యాలతో అధిక దిగుబడులు



ర్యాలీ చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: నవ ధాన్యాలతో అధిక దిగుబడులు సాధించవచ్చునని పాతటెక్కలి సర్పంచ్ తుంగాన సుశీల అన్నారు. సోమవారం పాతటెక్కలి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవ ధాన్యాల సాగుపై రైతులు, స్వయం శక్తి సంఘాల మహిళలకు అవగాహన కల్పిస్తూ పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. నవ ధాన్యాలతో భూసారం పెంచడం ద్వారా పంటలకు అవసరమైన పోషకాలు అందుతాయని తెలిపారు. నవధాన్యాలు ప్రధాన పంటలు వేసుకునే సమయానికి 45 రోజులు ముందుగా 30 రకాల విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. ఇందులో ముఖ్యంగా చిరుధాన్యాలు, తీగ, దుంప జాతి, కూరగాయలు, సుగంధ ద్రవ్యాల విత్తనాలు భూమిలో వేసుకుని 40 నుంచి 45 రోజుల వ్యవధిలో అవి భూమిలో కరిగినట్‌లైతే భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు జల్లు ఉషారాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పీఆర్‌పీ పెంటయ్య, జి.వెంకటరమణ, సీహెచ్ సంధ్యారాణి ఉన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



లావేరు: గుమడాంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

లావేరు : ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానం నుంచి ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. లావేరు మండలం గుమడాంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యావంతుడైన సీతంరాజు సుధాకర్‌ను ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానం ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేశారని, మార్చి 13న జరగనున్న ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలన్నారు. సుధాకర్‌ను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడుబొంతు సూర్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు ఎం.విజయలక్ష్మి, గుమడాం పంచాయతీ సర్పంచ్ గంధవరపు పైడయ్య, ఉప సర్పంచ్ దురగాసి ధర్మారావు, వార్డు మెంబర్ రేగిడి లక్ష్మణరావు, నాయకులు ముప్పిడి శ్రీరాములు, నాగం కనకరాజు, జగ్గురోతు తవిటినాయుడు, వాళ్లే సూర్యనారాయణ, యాలాల శిమ్మారావు, మీసాల రామప్పడు, దురగాసి సూర్యం, నడుపూరి రాంబాబు, బాడిత రాంబాబు, ఇజ్జాడ వెంకటరమణ, డి.అప్పలనాయుడు, ఇజ్జాడ సన్యాసప్పడు, బి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: జాడలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జి.సిగడాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల పార్టీ నాయకులు బూరాడ వెంకటరమణ, మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ పిలుపునిచ్చారు. సోమవారం బాతువ, ఎందువ, జాడ, ముషినివలస, పున్నాం, వెంకయ్యపేట, గెడ్డకంచరాం, గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పెద్ది శ్రీనివాసరావు, బూటు అప్పారావు, కుమరాపు రమేష్‌నాయుడు, సర్పంచులు చందక సతీష్, కుమరాపు శ్రీనివాసరావు, చిక్కాల ధర్మారావు, మాధవరావు, ఇజ్జి కోటి, పెద్దిలక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జి.సిగడాం : ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ సామంతుల రామారావు వాహనదారులకు సూచించారు. సోమవారం చిలకపాలెం–రాజాం ప్రధాన రహదారిలో వాండ్రంగి సమీపంలో రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపవద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవన్నారు. కార్యక్రమంలో న్యాయవాది పేడాడ శ్రీరామమూర్తి, సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, పేడాడ శ్యామలరావు, పేడాడ సత్తెరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద అమలుపై ఆరా



మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: మండలంలోని నాగంపాలెం ప్రభుత్వ పాఠశాలను సోమవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద మెనూను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జగ్గురోతు తవిటినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థులకు సిరప్ పట్టిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తోటపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సోమవారం ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోటపాలెం, కొంగరాం విలేజ్ హెల్త్ క్లినిక్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు మాట్లాడుతూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌తో పిల్లల్లో హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుందన్నారు. తద్వారా పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల వస్తుందన్నారు. హెబీ స్థాయి ఎక్కువగా ఉన్న పిల్లలు చురుగ్గా ఉంటారని తెలిపారు. పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం



పశువైద్య పరీక్షలు నిర్వహిస్తున్న రవికుమార్

లావేరు: పశువుల పెంపకంలో పాడిరైతులు జాగ్రత్తలు పాటించాలని వెంకటాపురం పశువైద్య ఉప కేంద్రం వెటర్నరీ జూనియర్ అధికారి రవికుమార్ అన్నారు. లింగాలవలస పంచాయతీలో సోమవారం పశు వైద్య తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పశువైద్యుల వద్దకు తీసుకువెళ్లాలన్నారు. చూడితో ఉంటే మరింత శ్రద్ధ వహించాలన్నారు. ముందస్తుగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ జి.గోపాల్, పాడి రైతులు పాల్గొన్నారు.

విధుల్లో ఎందుకింత నిర్లక్ష్యం



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

టెక్కలి: స్పందనకు వస్తున్న వినతుల పరిష్కారంలో కొంతమంది అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారంటూ టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందన విభాగంలో పది వినతులు స్వీకరించారు. టెక్కలి మండలంలో జగనన్న హౌసింగ్ విషయంలో రోజూ లబ్ధిదారులు వస్తున్నారని, తక్షణమే పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించాలన్నారు. ఇదే విషయాన్ని గత వారం ప్రస్తావించామని అయినప్పటికీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని మండిపడ్డారు. తిత్లీ తుపాను సమయంలో టెక్కలి మండలం రావివలసలోని మల్లన్న ఆలయం ముఖద్వారం, పాఠశాల సమీపంలో మంచినీటి ట్యాంకు మెట్లు పూర్తిగా దెబ్బతిన్నాయని ఇప్పటి వరకు వాటికి మరమ్మతులు చేయలేదని పలువురు ఫిర్యాదు చేశారు. అలాగే ఇటీవల రావివలసలో నిర్వహించిన శివరాత్రి ఉత్సవాల్లో మల్లన్న ఆలయ ప్రాంగణంలో ప్రైవేట్ వ్యక్తులు ప్రసాదాల అమ్మకాలు చేశారని ఫిర్యాదు అందింది. తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని టెక్కలి చిన్నబ్రాహ్మణవీధికి చెందిన జి.చినమ్మడు విన్నవించారు. తనకు చెందిన స్థలాన్ని కొంత మంది వ్యక్తులు ఫోర్జరీ సంతకాలు చేసి తప్పుడు పత్రాలు సృష్టించారని కోటబొమ్మాళి మండలం చిన్నబమ్మిడి గ్రామానికి చెందిన వాన లచ్చమ్మ వినతి అందజేశారు. అంగన్‌వాడీ ఆయా పోస్టును మంజూరు చేయాలని కోటబొమ్మాళికి చెందిన కూన హేమకుమారి విన్నవించారు. అలాగే ధర్మనీలాపురం రెవెన్యూ గ్రూపులో సర్వే నంబర్ 14లో సుమారు తొమ్మిది ఎకరాల సాగు భూమి ని 22–ఏ రికార్డుల నుంచి తొలగించాలని ఆయా రైతులు సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. ఐదేళ్ల క్రితం రెవెన్యూ అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకుండా జిరాయితీ భూములను 22–ఏ రికార్డుల్లో చేర్చారని అప్పటి నుంచి రైతులంతా అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కుటుంబ అవసరాలు, ఆడపిల్లల వివాహానికి భూముల క్రయా విక్రయాలు జరగకపోవడంతో అవస్థలు పడుతున్నామని వెల్లడించారు. తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.